నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | NAGARKURNOOL

- కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్
- నియోజకవర్గ కేంద్రాల్లో రైతు దీక్షలు
- హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల, మాజీ ఎమ్మెల్యేలు
- జూటాకోర్ సీఎం రేవంత్‌పై కన్నెర్ర
- పంటనష్ట పరిహారం, ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్



దీక్షలో కూర్చొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పరిహారం చెల్లించి ఆదుకోవాలి

- పొలంబాటలో కేసీఆర్.. చేరికల బాటలో సీఎం రేవంత్
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 6 : ఎండిన పంటలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలంబాట పడితే.. ఢిల్లీ పెద్దల మెప్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేరికల బాట పట్టారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బండ్ల అధ్యతన రైతుదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్వింటాకు అదనంగా రూ.500 బోనస్, ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ఎండగడుతామన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో సాధ్యం కాని ఎన్నో పనులను కేసీఆర్ పదేండ్లలో పూర్తి చేశాడన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపితే మళ్లీ దండుగ అనేలా కాంగ్రెస్ చేస్తున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం రైతులను ఆదుకునే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

15న జలదీక్ష..

గద్వాల నియోజకవర్గంలో ఈనెల 15న జలదీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ దీక్షకు రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారని, నియోజక రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ వచ్చె.. కరువు తెచ్చె

- రైతులను ఆదుకునే వరకు రేవంత్ ప్రభుత్వాన్నివిడి చిపెట్టం..
- బీఆర్ఎస్‌మ హబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రైతుదీక్షలో మాట్లాడుతున్నల క్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 6 : పదేండ్లపాటు సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు పాలు చేసిందని బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి విమర్శించారు. శనివారం జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన దీక్షలో లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆయన స్పష్టం చేశారు. కరెంట్ సమస్యలతో మోటర్లు కాలిపోతున్నాయి. సరిపడా నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో 300 పిల్లర్లకు రెండు పిల్లరు దెబ్బతింటే వాటిని బాగుచేయకుండా స్వార్థ రాజకీయాల కోసం నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. రైతుల పక్షా న పోరాడేందుకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, అన్ని మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



రైతుదీక్షలో మాట్లాడుతున్నబీఆ ర్ఎస్‌నా గర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

హామీలను వెంటనే నెరవేర్చాలి

- రైతులసం తకాలు ఫోర్జరీ చేసినోళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- బీఆర్ఎస్‌నా గర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులకు మద్దతుగా నిర్వహించిన రైతుదీక్షలో గువ్వల పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని, వెంటనే అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలకు న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టుల్లో నిల్వ ఉన్న నీళ్లను ఇవ్వకుండా రైతులకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, చనిపోయిన రైతుల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహా గౌడ్, కౌన్సిలర్లు రమేశ్‌రావు, వేణు, ఎంపీటీసీ రాంబాబు, చెన్నకేశవులు, శంకర్, వంశీ, రాజు, రైతులు పాల్గొన్నారు.



రైతుదీక్షలో మాట్లాడుతున్నకల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఏం వెలగబెట్టారని జన జాతర సభ?

- కాంగ్రెస్ మెడలు వంచుదాం
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుదామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీలు విజితారెడ్డి, దశరథనాయక్‌తో కలిసి జైపాల్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఏం వెలగబెట్టారని జనజాతర సభ నిర్వహిస్తున్నారు? ప్రజలు సాగు, తాగునీటికి తండ్లాడుతుంటే మీకు సభలు అవసరమా? అని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో ప్రచారానికి వస్తే చీపురు దెబ్బలు తప్పవని హెచ్చరించారు.

అరిగోస పడుతుంటే ఐపీఎల్ చూస్తారా?

- బీఆర్ఎస్‌వన పర్తి జిల్లా అధ్యక్షుడుగట్టు యాదవ్

వనపర్తి, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం వస్తూనే రాష్ట్రంలోకి కరువును తీసుకొచ్చిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ విమర్శించారు. కలెక్టరేట్ వద్దనున్న ధర్నా చౌక్‌లో శనివారం నిర్వహించిన రైతు నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు రోడ్ల పైకి వచ్చి అరిగోస పడుతుంటే ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారని, రైతులను అవమానకరంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు రాములు, నాయకులు వెంకటస్వామి, రాజశేఖర్, జాత్రునాయక్, పరంజ్యోతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గట్టుయాదవ్

పాలమూరులో చేపట్టిన రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్నమా జీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రైతు కోసం రణం

రైతు కోసం బీఆర్ఎస్ రణం మొదలుపెట్టింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా ఎదిగిన రైతు నేడు కాంగ్రెస్ హయాంలో కుదేలవుతుండడంతో తల్లడిల్లిపోతున్నది. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా టైంపాస్ చేస్తున్న రేవంత్ సర్కారుపై భగ్గుమన్నది. శనివారం ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో గులాబీ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్షలు చేపట్టింది. బీఆర్ఎస్ దండు కదిలిరాగా.. కర్షకులు తరలొచ్చారు. వరి కంకులను చేతబూని హస్తం పార్టీకి వ్యతిరేకంగా నినదించారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్చర్ల, దేవరకద్ర, అచ్చంపేట, నారాయణపేట, కల్వకుర్తి, మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రాజేందర్‌రెడ్డి, జైపాల్ యాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, వనపర్తిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎండిన పంటలకు ఎకరాకు రూ.25,000, ధాన్యం కొనుగోలుకు క్వింటాకు రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు.

- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఎండిన పంటకు పరిహారం చెల్లించాలి : ఎంపీ మన్నె

ఏ రైతును కదిలించినా కన్నీళ్లే..

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 6 : నాలుగు నెలల్లోనే రాష్ట్రం ఎడారిగా మారిందని, రైతుల ఆత్మహత్యలే అందుకు నిదర్శనమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పంట చేతికి రాక అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో రైతు సమస్యలపై ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పదేండ్లకు ముందు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువేనని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో తాగునీటికి ఇబ్బందులు లేవని, ఇప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నరు.. మళ్లీ బోర్లు వేసుకుంటున్నరు.. ఏ రైతును కదిలించినా కన్నీరే మిగిలిందన్నారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? రైతు భరోసా ఏమైంది? డిసెంబర్ 9న రుణమాఫీపై సంతకం చేసిన ఫైల్ ఎక్కడుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్లి అడిగితే ఏ ప్రభుత్వం బాగుండేదో ప్రజలే సమాధానం చెబుతారన్నారు. క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. మన్యంకొండ రోప్‌వే, పెద్ద చెరువు పనులను ఆపివేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ మన్నె మాట్లాడుతూ అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలని, చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ గణేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహెమాన్, ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజు, నాయకులు గిరిధర్‌రెడ్డి, శివరాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

రైతులపై కాంగ్రెస్‌కు చిన్నచూపెందుకు?

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో సాగునీళ్లు లేక, భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయి రైతులు ఆగమవుతున్నారని, వారిని ఆదుకొని అండగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకద్రలో రైతులతో కలిసి మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, కొత్తకోట ఎంపీపీ మౌనిక, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, నాయకులు జెట్టి నర్సింహారెడ్డి, నారాయణగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులస మావేశంలోమా ట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెంరామ్మోహన్‌రెడ్డి

రైతులను కష్టపెడితే ఆందోళనలు తప్పవు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్ టౌన్, ఏప్రిల్ 6 : సాగునీటిపై ఎమ్మెల్యేకు అవగాహన లేకనే యాసంగిలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మక్తల్ తాసీల్దార్ సువర్ణరాజుకు చిట్టెం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేకు సాగునీటిపై అవగాహన లేకనే నియోజకవర్గంలో చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్యే వాహనానికిచ్చే స్టిక్కర్లను ఇతర వ్యక్తులకు ఇవ్వడమేంటని, ఈ విషయమై శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ పథకాన్ని అమలుచేసిన కాంగ్రెస్.. మిగతా హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. ఎండిపోయిన పంటలను గుర్తించి ప్రతి రైతుకూ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను కష్టపెడితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా నారాయణపేట జయమ్మచెరువును నింపడానికి కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటిని తరలిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ రైతులకు నష్టం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

- బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 6 : ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించిన రైతుదీక్షలో రాజేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 120 రోజుల పాలనలో ఒక్కసారైనా రైతుల గురించి ఆలోచించారా? అని ప్రశ్నించారు. పదేండ్లలో ఒక్కసారి కూడా కాలిపోని బోర్లు.. 20 రోజుల్లో ఒకే రైతుకు చెందిన బోరు 5, 6 సార్లు కాలిపోతున్నాయంటే కరెంట్ ఏ విధంగా సరఫరా అవుతుందో ఇట్టే అర్థమైతుందన్నారు. నాటు వేసే సమయంలో రావాల్సిన పెట్టుబడి సాయం పంట చేతికొచ్చాక కూడా ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. సీ ఎంకు క్రికెట్ మ్యాచ్ చూడడానికి సమయం ఉంది కానీ.. రైతుల గురించి ఆలోచించే తీరిక లేదని ఎద్దేవా చేశారు. 200 మంది రైతులు చనిపోతే ఏ మంత్రీ పరామర్శించలేదని విమర్శించారు. రైతులకు మేలు చేసేదాక బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, మండల అధ్యక్షులు రాములు, కృష్ణయ్య, వెంకటరెడ్డి, తిరుపతయ్య, ఎంపీపీలు శ్రీనివాస్‌రెడ్డి, నర్సప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు రాచప్ప, సంపత్, మల్లప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులతో కలిసి రైతుదీక్షలో వరి కంకులతో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మంత్రులకు మతిభ్రమించింది

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- అక్రమ కేసులకు భయపడం
- గులాబీ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ
- బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులు పూర్తి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీరం

సన్నాహక సమావేశానికి హాజరైన గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్, ఏప్రిల్ 6 : సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పనుల్లో అవినీతి జరిగిందని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆరోపించడం దురదృష్టకరమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జూపల్లి హయాంలోనే పీఆర్ఎల్ఐ, మిషన్ భగీరథ పనులు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. పీఆర్ఎల్ఐ పనులు 20 శాతం పూర్తయితే 90 శాతం నిధులు డ్రా చేసిన మంత్రి పొంగులేటి తమ మంత్రి వర్గంలోనే ఉన్నాడని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. రైతులు కష్టాల్లో ఉంటే సీఎం మాత్రం ఐపీఎల్ టోర్నీలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. రైతుల కుమద్దతుగా బీఆర్ఎస్ దీక్షలు కొనసాగుతాయన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించమని తేల్చి చెప్పారు. మంత్రి జూపల్లి ప్రోద్బలంతోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. స్థానికేతరుడైన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి ఈ ప్రాంత సమస్యలు పట్టవని, ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామన్న బీజేపీకి మద్దతు ఇవ్వొద్దని ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగను కోరారు. ఎంపీ ఎన్నికల్లో తెలంగాణ ద్రోహులను ఓడించాలన్నారు. కేసీఆర్ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పనులు పూర్తి చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో సీనియర్ నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీలు రజిత, సోమేశ్వరమ్మ, కౌన్సిలర్లు కృష్ణ, కృష్ణమూర్తి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.